# వీమ్డ్ శిక్షణా సంస్థను పునరుద్ధరించాలి


మంత్రికి జ్ఞాపిక అందిస్తున్న లక్ష్మీవాణి

**నాంపల్లి:** చేనేత భవన్‌లోని మహిళలకు పలు వృత్తి కోర్సుల్లో తర్ఫీదు ఇచ్చే ఉచిత శిక్షణ సంస్థ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ఫర్ ఎంఎస్‌ఎంఈ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ డీవీవీ శ్రీలక్ష్మీవాణి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలోని చేనేత భవన్‌లో కొన్నేళ్లుగా నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద మహిళలకు ‘వీమ్డ్’ సంస్థ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, మెహిందీ, బ్యూటీషియన్, కంప్యూటర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అయితే, ఇటీవల తన శిక్షణా సంస్థను అధికారులు అకారణంగా మూసివేశారన్నారు. దీంతో ట్రైనింగ్ కార్యక్రమాలు నిలిచిపోయాయని తెలిపారు. తమ సమస్యపై మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారని లక్ష్మీవాణి చెప్పారు.

# ‘అక్షదీప్’ విద్యార్థికి కాంస్య పతకం


క్రీడాకారులను సన్మానించిన అలీ తదితరులు

**జియాగూడ:** ఖేల్ ఇండియా రెజ్లింగ్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో అక్షదీప్ కళాశాల విద్యార్థి కాంస్య పతకాన్ని సాధించడం గర్వంగా ఉందని కళాశాల డైరెక్టర్, కరస్పాండెంట్ మహ్మద్ అక్రమ్ అలీ అన్నారు. ఈ మేరకు రెజ్లింగ్ పోటీల్లో బ్రాంజీ, గోల్డ్, రన్నరప్‌గా నిలిచిన నలుగురు విద్యార్థులను శుక్రవారం కళాశాలలో సత్కరించారు. అనంతరం అక్రమ్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామన్నారు. రెజ్లింగ్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థి కె.గజానన్ రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకం సాధించినట్లు చెప్పారు. అలాగే స్విట్జర్‌లాండ్‌లో జరిగిన సుమో రెజ్లింగ్ పోటీల్లో జె.వినాయక్ రాజ్‌సింగ్ బంగారు పతకం సాధించాడన్నారు. న్యూ ఢిల్లీలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్‌లో షేక్ అజీమ్, ఎస్‌జీఎఫ్ న్యూ ఢిల్లీలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో కూడా తనీషా సింగ్ పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఖేల్ ఇండియా గేమ్స్ శిక్షకుడు కట్ట శ్రీనివాస్, హైదరాబాద్ డిస్ట్రిక్ రెజ్లింగ్ సీనియర్ ఉపాధ్యక్షుడు శైలేందర్ సింగ్ పహిల్వాన్, ఇంటర్నేషనల్ కోచ్ సన్నిబాబు, హైదరాబాద్ ఆర్గనైజింగ్ కార్యదర్శి మహ్మద్ అస్లాం తదితరులున్నారు.

# 10న సరస్వతి విద్యానికేతన్ వార్షికోత్సవం


ఎమ్మెల్యే జి.వినోద్‌ను కలిసిన స్కూల్ సిబ్బంది

**జియాగూడ:** ఈ నెల 10వ తేదీన జియాగూడ సరస్వతి విద్యానికేతన్ హైస్కూల్ 20వ వార్షికోత్సవానికి హాజరు కావాల్సిందిగా బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్‌ను ఆహ్వానించినట్లు స్కూల్ డైరెక్టర్ బాల్‌రాజ్ కౌలే తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసిన అనంతరం బాల్‌రాజ్ కౌలే మాట్లాడారు. ఇరవై ఏళ్లుగా జియాగూడలో స్కూల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఎస్‌బీఏ గార్డెన్‌లో వేడుకలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘ సేవకుడు పీఎం రాజు, ఠాకూర్ రఘునందన్ సింగ్ ఉన్నారు.

# సమస్యలపై ఉద్యోగుల పర్యటనలు


మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్

**నాంపల్లి:** తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జిల్లాల పర్యటనను విజయవంతం చేయాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నాంపల్లిలోని ఆ సంఘం కేంద్ర కార్యాలయం నుంచి జిల్లాల పర్యటనకు బయలుదేరిన వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటిస్తామని, మొదటగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి తమ కార్యక్రమం ప్రారంభమై ఆదిలాబాద్ జిల్లాతో ముగుస్తుందని వివరించారు. ప్రతి నెలా మూడు జిల్లాల్లో పర్యటించి ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటామని తెలిపారు. ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందనే నమ్మకం, విశ్వాసం తమకు ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన వైఎస్సార్ పాలనను తలపిస్తోందని చెప్పారు.

# వాణిజ్య పన్నుల శాఖ కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కమిషనర్ శ్రీదేవి తదితరులు

**అబిడ్స్:** వాణిజ్య పన్నుల శాఖ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కేలండర్, డైరీని ఆ శాఖ కమిషనర్ శ్రీదేవి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణిజ్య పన్నుల శాఖలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ టీసీటీఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు విన్నవించారు. శాఖలో పని చేస్తున్న ఏసీపీఓలకు వెంటనే గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం కమిషనర్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఉద్యోగులు సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కామేశ్వరి, అధికారులు సునీత, లావణ్య, కవిత తదితరులున్నారు.

**‘సమాచార’ టీఎన్జీఓస్ కేలండర్ విడుదల**

**విజయనగర్‌కాలనీ:** మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో శుక్రవారం ఐ అండ్ పీఆర్ యూనిట్ తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ ఆధ్వర్యంలో కేలండర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ కె.అశోక్‌రెడ్డితో పాటు యూనియన్ అధ్యక్షుడు డి.జితేందర్, కార్యదర్శి కె.అనిల్‌కుమార్, కోశాధికారి టి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీలలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల సంక్షేమానికి కృషి



**అబిడ్స్:** క్రీడాకారుల సంక్షేమానికి టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ప్రత్యేక కృషి చేస్తోందని ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లావాసి ప్రఖ్యాత బాక్సర్ మహ్మద్ హుసాముద్దీన్‌కు డెస్టినీ గ్రూప్స్ ప్రకటించిన రెండు లక్షల చెక్కును ముజీబ్ హుస్సేని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను అభివృద్ధి పరిచేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం ఉద్యోగులకు క్రీడా పోటీల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## వేణుగోపాల్‌రావుకు సన్మానం



**యాకుత్‌పురా:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన హర్కర్ వేణుగోపాల్‌రావును శుక్రవారం సెట్విన్ సంస్థ మాజీ డైరెక్టర్, టీపీసీసీ కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్ కలిసి సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు.

# పనుల పర్యవేక్షణ అధికారుల బాధ్యత


బల్దియా అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**గోల్కొండ:** అభివృద్ధి పనుల పర్యవేక్షణ బాధ్యత అధికారులపై ఉందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన బల్దియా ఇంజినీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారుల పర్యవేక్షణ లోపిస్తే పనులు సకాలంలో పూర్తి కావన్నారు. అసంపూర్తి పనుల వల్ల స్థానికులకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. గోల్కొండ డివిజన్‌లోని అహ్మద్ కాలనీతో పాటు రేతిగల్లి, రిసాల బజార్, మోహల్లా గంజ్, టోలిచౌకీ డివిజన్‌లోని తూమ్స్ రోడ్డు, నదీమ్ కాలనీ, రాఘవ కాలనీ తదితర ప్రాంతాల్లోని రోడ్డు పనులను తక్షణమే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా నానల్‌నగర్ డివిజన్‌లో సైతం పలు రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని అధికారులకు గుర్తుచేశారు. కార్యక్రమంలో మెయింటెనెన్స్ ఈఈ వెంకట శేషయ్య, డిప్యూటీ ఈఈ ఎస్.రామకృష్ణ తదితరులున్నారు.

# బస్టాండ్ ఎక్కడ?

- కనుమరుగైన చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్
- భవనాన్ని కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ
- ఆరేళ్లుగా ప్రయాణికుల ఇబ్బందులు


బస్టాండ్ లేక రోడ్డుపైనే మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

> చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ లేక పాతబస్తీ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా ఇక్కడ కొనసాగిన బస్టాండ్‌ను కూల్చివేయడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయని జీహెచ్‌ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చార్మినార్:** పాతబస్తీలోని చార్మినార్, బహదూర్‌పురా, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట తదితర నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రయాణికులకు ఈ స్టేషన్ ప్రధానంగా ఉండేది. అయితే, ఇక్కడ మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు పాత భవన సముదాయాన్ని 2018లో కూల్చివేశారు. ఆరేళ్లు గడుస్తున్నా ఇక్కడ ఎలాంటి నిర్మాణం చేయలేదు.

**గతంలో చార్మినార్ వద్దే..**

30 ఏళ్ల క్రితం చార్మినార్ కట్టడం వద్దే చార్మినార్ బస్‌స్టేషన్ కొనసాగింది. అయితే, 1989లో సీపీపీ (చార్మినార్ పెడస్ట్రియన్ ప్రాజెక్టు) పనుల కోసం అక్కడి నుంచి పంచ్ మోహల్లాకు తరలించారు. అంతకు ముందు ఇక్కడ పంచ్ మోహల్లా డిపో ఉండేది. ఈక్రమంలో 2005లో చార్మినార్ బస్‌స్టేషన్ ఇక్కడి నుంచి తరలించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే, తరలింపుపై స్థానికులు, వ్యాపారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేశారు. అంతేకాకుండా 2006లో బస్టాండ్ యథాస్థానంలో ఉండాలంటూ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో పంచ్‌మోహల్లాలోనే చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్ కొనసాగాలంటూ 2007లో కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా చార్మినార్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఎట్టి పరిస్థితుల్లో తరలించరాదని ఆర్టీసీ అధికారులను 2008లో హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సైతం కోరారు. అప్పటి నుంచి చార్మినార్ బస్టాండ్ అక్కడే కొనసాగింది. కాగా, 2018 జనవరి 24వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో భవనాన్ని తొలగించడంతో చార్మినార్‌లో ఆర్టీసీ బస్సులను నిలపడానికి ఎలాంటి బస్టాండ్ లేకుండాపోయింది.

**ఆరేళ్లుగా రోడ్డుపైనే..**

మల్టీ లెవల్ పార్కింగ్ కోసం చార్మినార్ ఆర్టీసీ బస్టాండ్ తొలగించి ఆరేళ్లు గడిచినా ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించ లేదు. ప్రస్తుతం ఇక్కడ తాత్కాలిక పార్కింగ్ కొనసాగుతోంది. చార్మినార్ ప్రధాన రోడ్డుపైనే ఒక వైపు బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. బస్సులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో రోడ్డు మధ్య నుంచే వాహనాలను తిప్పుతున్నారు డ్రైవర్లు. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడూ.. ట్రాఫిక్‌జాం అవుతోంది.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్:** చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో నేటి(శనివారం) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ అప్జల్ బాబా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాలార్జంగ్ సబ్ స్టేషన్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మదీనా, అలీజా కోట్ల, పత్తర్‌గట్టి తదితర ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదు.

**ఫలక్‌నుమా పరిధిలో..**

సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, జంగమ్మెట్ ఓహెచ్, జంగమ్మెట్ ఏబీసీ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, గుంటల్ షా దర్గా, అంజదుల్లా బాగ్ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదు.

**అఫ్జల్‌గంజ్:** 11 కేవీ హిందీనగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో చాక్నావాడి, రజక్‌పురా, భారత్ మెటల్ వర్క్స్ లేన్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదు. అలాగే 11 కేవీ ఫీల్‌ఖానా విద్యుత్ ఫీడర్ పరిధిలో అజీజ్ ప్లాజా, రంగచారి లేన్, ప్రేమ్ ప్లాజా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరాఫరా ఉండదు.

## ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

**గోల్కొండ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ దేశాభివృద్ధికి తోడ్పతుందని టోలీచౌకి బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి అన్నారు. ప్రధాని మోదీ పదేళ్ల పాలనలో దేశం సాధించిన విజయాలు, పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు గోల్కొండ రిసాల బజార్‌లో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌చారి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో బి.సాయిబాబా చారి, సురేశ్‌చారి, శివరాజ్, ఎం.దివాకర్‌రెడ్డి, ముఖేశ్ తదితరులున్నారు.

**బడ్జెట్ భేష్ : అమర్‌సింగ్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యుత్తమైనదని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద బడుగు వర్గాల వారికి ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేశారన్నారు. ప్రజలకు ఉపయోగపడే రవాణా రంగ అభ్యున్నతికి ఎక్కువ నిధులు కేటాయించడం హర్షణీయమని చెప్పారు. అదేవిధంగా రైతులు, ఇళ్లు లేని నిరుపేదల కోసం వేల కోట్ల రూపాయలు కేటాయించడం బీజేపీ ప్రభుత్వ విధానానికి నిదర్శనమన్నారు.

**అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం..**


పంకజ్‌కుమార్ అగర్వాల్

**చార్మినార్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం ఆయన రికాబ్‌గంజ్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బడ్జెట్‌పై పాతబస్తీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

## శుభాకాంక్షలు



**చాంద్రాయణగుట్ట:** బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు రాష్ట్ర అధికార ప్రతినిధి మాదరి చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

## గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు



**అబిడ్స్:** గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా బి.రాజు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ముజీబ్ ఉర్ రెహ్మాన్ ఎస్‌బీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రాజు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. కాలనీలు, బస్తీల్లో ప్రతి రోజు ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే


పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**యాకుత్‌పురా:** విద్యార్థులు శ్రద్ధగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలసి బస్తీలలో పర్యటించారు. రెయిన్‌బజార్ చమన్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి.. విద్యార్థులకు అందిస్తున్న బోధన, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలలో పాదయాత్రలు చేస్తూ స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ నాయకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


కళాకారులతో కన్వీనర్ ముఖైర్ హైదర్ తదితరులు

**అబిడ్స్:** ఎగ్జిబిషన్‌లో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్లోబల్ కల్చరల్ ఫెస్టివల్ కన్వీనర్ ముఖైర్ హైదర్ కూచిపూడి నృత్యాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

## 10న హరివిల్లు కవితా సంపుటి ఆవిష్కరణ

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన రవీంద్రభారతిలో హరివిల్లు పుస్తకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలే నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు ఆలూరి వెల్సన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు ఆర్‌కృష్ణయ్య, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రీతీ నిగంల తదితరులు హాజరవుతారని తెలిపారు.

## పుస్తకావిష్కరణ



న్యాయవాదులు, తెలుగు మాధ్యమ న్యాయ విద్యార్థులకు ఉపయోగపడేలా అబ్బూరి వెంకటరమణ రచించిన పుస్తకాలను శుక్రవారం తెలంగాణ బార్ కౌన్సిల్‌లో ఆవిష్కరిస్తున్న చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావు, వైస్ చైర్మన్ సునీల్ గౌడ్

## 32 సీసీ కెమెరాలు ప్రారంభం

**అబిడ్స్:** గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి పద్మనాభనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను శుక్రవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుల్సుంపురా ఏసీపీ మహ్మద్ జావేద్, గుడిమల్కాపూర్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ఎస్సై జ్యోతి పాల్గొన్నారు.

## చిత్తడి నేలల దినోత్సవం



**బహదూర్‌పురా:** వన్యప్రాణి, ప్రకృతి సంరక్షణ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని జూపార్కులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపార్కులోని జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రాష్ట్రంలోని చిత్తడి నేలలను వివరించే ఫొటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్ హిరేమత్ తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధన కోసం మెమొరాండం


ముఖ్యమంత్రికి మెమొరాండం అందజేస్తున్న నాయకులు

**అబిడ్స్:** తెలంగాణ సాయుధ రైతు పోరాట యోధుడు రాజ్‌నారాయణరెడ్డి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ వలంటీర్స్ కన్వీనర్ ఆర్.సుఖేశ్‌రెడ్డి శుక్రవారం మెమొరాండం అందజేశారు. అంతేకాకుండా జలాల్‌పూర్ గ్రామంలోని రామానంద తీర్థ గ్రామీణాభివృద్ధి సంస్థను వృత్తి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దాలని, ఆర్ఆర్ఆర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. తమ డిమాండ్లపై సీఎం సానుకూలంగా స్పందించారని ఈ సందర్భంగా అనిల్‌కుమార్ రెడ్డి, సుఖేశ్‌రెడ్డి తెలిపారు.

## వివాహ శుభాకాంక్షలు


శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి పొన్నం

**చార్మినార్:** మస్కతీ డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ పార్టనర్ ఆదిల్ మస్కతీ కుమార్తె వివాహానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పాతబస్తీ శివారులోని త్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వివాహ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార, ప్రణాళిక కన్వీనర్ అలీ మస్కతీ, ఎమ్మెల్యే దానం నాగేందర్, మధుయాష్కీ గౌడ్, గాజుల అంజయ్య, ఆమేర్ అలీఖాన్, ఇబ్రహీం మస్కతీ, మోహసిన్ మస్కతీ, సుల్తాన్ మస్కతీ, మహమ్మద్ మస్కతీ, ఖాలేద్ మస్కతీ, ఓమర్‌ఖాన్ తదితరులు హాజరయ్యారు.

## పార్టీని మరింత బలోపేతం చేస్తాం


శ్రీధర్‌ను కలిసిన జీవన్

**చార్మినార్:** బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌కు అభినందనలు తెలిపినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు గాదేపాగ జీవన్ జీ తెలిపారు. నాంపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం శ్రీధర్‌ను కలిసి రాష్ట్ర బీజేపీలోని ఎస్సీ నాయకులు, కార్యకర్తల కార్యకలాపాలపై చర్చించామన్నారు. ఎస్సీ విభాగాన్ని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా శ్రీధర్ చెప్పారన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

**గోల్కొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. శుక్రవారం రేతిబౌలి రింగ్ రోడ్ వద్ద కాంగ్రెస్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల పాలనకు తెలంగాణ ఓటర్లు అంతం పలికారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే నాయకులకు గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. తమ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే సగం అమలులోకి వచ్చాయని కృష్ణ చెప్పారు.

## హిందీ ప్రచార సభ నూతన కార్యవర్గం

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ హిందీ ప్రచార సభ నూతన అధ్యక్షుడిగా కె.రాంచందర్, కార్యదర్శిగా ఏకే రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం నాంపల్లి స్టేషన్‌రోడ్డులోని హిందీ ప్రచార సభ కార్యాలయంలో ఈమేరకు నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హిందీ ప్రచార సభ సంయుక్త కార్యదర్శిగా కాల్వ సరిత, కోశాధికారి రామ్మోహనాచారి, పరీక్ష సంచాలకుడు మల్లారెడ్డి, ప్రచార సంచాలకుడు శ్యామ్‌సుందర్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్, ప్రధాన కార్యదర్శి గైబువల్లి తదితరులున్నారు.

## విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

**గన్‌ఫౌండ్రీ:** విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి సూచించారు. శుక్రవారం రవీంద్రభారతిలో తపస్య కాలేజ్ ఆఫ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పుడే పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణిస్తారని చెప్పారు. అనంతరం 500 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఓయు పరీక్షల నియంత్రణ అధికారి రాములు, తపస్య కళాశాల చైర్మన్ ముప్పాల శ్రీధర్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**చార్మినార్:** ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని చార్మినార్ జోన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రాజశ్రీ అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సయ్యద్ రఫీక్‌తో కలిసి పాతబస్తీలోని పంజేషా-1, జలాల్‌కుంచ, మోచీ కాలనీ, ఐటీఐ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించడంతో పాటు రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్య సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు

**యాకుత్‌పురా:** రోడ్డు భద్రతా మాసోత్సవాలల్లో భాగంగా స్టేషన్ పరిధిలోని ప్రధాన కూడళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయిముద్దీన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం పురానీ హవేలీ లోని ముఖరంజా పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. విద్యార్థులకు రోడ్డు భద్రత, హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్ , ట్రాఫిక్ నిబంధనలు వివరించారు.

## భోజన సేవ



**గోల్కొండ:** ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు రాత్రి పూట భోజనం ఉచితంగా అందిస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. శుక్రవారం పలు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద ఆయన భోజన ప్యాకెట్లు అందించారు. దాతలు, స్నేహితులు, సంఘ సేవకుల సహాయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని మహ్మద్ బషీర్ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్.. 22 మందికి శిక్ష

**సంతోష్‌నగర్:** సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందిని నాంపల్లి 9వ ఎంఎం కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహ నాయక్ తెలిపారు. ఇందులో 12 మందికి జైలు శిక్ష, నలుగురికి జరిమానా.. రెండు రోజుల జైలు శిక్ష, ఏడుగురికి జరిమానా.. నాలుగు రోజుల జైలు శిక్ష, ఒకరికి జరిమానా.. 8 రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు.